# తెలంగాణభవన్‌కు హోరెత్తిన గులాబీదండు

- కేటీఆర్‌కు మద్దతుగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన శ్రేణులు
- ఉ.8 గంటల నుంచే కిటకిటలాడిన కార్యాలయ పరిసరాలు
- జై కేసీఆర్, జై కేటీఆర్, జై తెలంగాణ నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం
- నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసిన మాజీ మంత్రి హరీశ్
- తెలంగాణ భవన్‌కు తాళం వేసి కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్ జూన్ 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ-కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ మరోసారి విచారణకు పిలవడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. రాష్ట్ర నలు మూలల నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఏసీబీ ఆఫీస్, తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి ఖ్యాతిని తీసుకొచ్చిన కేటీఆర్‌కు అపకీర్తిని అంటించేందుకు కాంగ్రెస్ సర్కారు కుటిలయత్నాలు చేస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో పదేండ్లపాటు మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా హైదరాబాద్ ప్రతిష్ఠను పెంచిన నాయకుడు కేటీఆర్ అని గళమెత్తారు. అలాంటి కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 14 అక్రమ కేసులు బనాయించిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పేందుకు తెలంగాణ జనం ఏకమవుతున్నారని స్పష్టంచేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రోద్బలంతోనే ఏసీబీ కేసు నమోదు చేసిందని ఆరోపించారు.

### పోలీసుల అత్యుత్సాహం.. గేటుకు తాళం

**కేటీఆర్** తెలంగాణ భవన్‌కు వస్తున్నారనే సమాచారంతో అక్కడ ఉదయమే వందలాది మంది పోలీసులు మొహరించారు. రోప్‌వే టీంలు, మహిళా పోలీసులను రంగంలోకి దింపారు. గేటు వద్ద తనిఖీలు చేస్తూ కార్యకర్తలను అడ్డుకునేందుకు యత్నించారు. గులాబీ శ్రేణులు ప్రతిఘటించడంతో బయటే కాపాలా ఉన్నారు. కేటీఆర్ కాన్వాయ్ భవన్‌లోకి ప్రవేశించిన తర్వాత ఆయన వెంట వచ్చిన నేతలను ఆపేందుకు యత్నించారు. కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు వెళ్లిన వెంటనే తెలంగాణ భవన్ రెండు వైపుల గేట్లకు తాళాలు వేశారు. నేతలు, కార్యకర్తలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. గట్టిగా నిలదీయడంతో అరగంట తర్వాత రాకపోకలను అనుమతించారు.

### కేటీఆర్‌కు అండగా కదిలొచ్చిన దండు

ఏసీబీ విచారణకు హాజరవుతున్న కేటీఆర్‌కు సంఘీభావం తెలిపేందుకు రాష్ట్ర నలు మూలల నుంచి తెలంగాణ భవన్‌కు సోమవారం గులాబీ దండు కదిలివచ్చింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, నేతల కోలాహలంతో కిటకిటలాడింది. గులాబీ జెండాల రెపరెపలతో కళకళలాడింది. జై కేసీఆర్.. జై రామన్న.. జై తెలంగాణ.. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్.. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన.. అనే నినాదాలతో భవన్ ప్రాంగణం ప్రతిధ్వనించింది. కేటీఆర్ కాన్వాయ్ తెలంగాణ భవన్‌లోకి ప్రవేశించగానే నినాదాలతో మారుమోగింది. మహిళా నేతలు, కార్యకర్తలు అభిమాననేతకు సాదర స్వాగతం పలికారు. కిక్కిరిసిన శ్రేణుల మధ్య అతికష్టంమీద భవన్‌లోకి వెళ్లిన కేటీఆర్.. మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పార్టీ లీగల్‌టీమ్‌తో సమాలోచనలు జరిపారు. అనంతరం తెలంగాణ భవన్ ప్రధాన ద్వారం వద్ద మీడియాతో మాట్లాడారు. అనంతరం జై తెలంగాణ నినాదాలు చేసుకుంటూ కారెక్కి విచారణ కోసం ఏసీబీ కార్యాలయానికి బయల్దేరి వెళ్లారు.



ఏసీబీ విచారణకు హాజరైన అనంతరం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలకు అభివాదం చేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### జ్వరంతోనే పర్యవేక్షించిన హరీశ్‌రావు

కేటీఆర్ రాకకు కొద్దిసేపటి ముందే మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేశారు. వారికి అవసరమైన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యకర్తలు సహనం కోల్పోవద్దని సంయమనం పాటించాలని సూచనలు చేశారు. అంతిమ విజయం తమదేనని శ్రేణులు అధైర్యపడవద్దని ఉద్బోధించారు. ఈ సర్కారుకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. హరీశ్‌రావు జ్వరంతో బాధపడుతూనే కార్యకర్తలను సమన్వయపరుస్తూ.. దిశానిర్దేశం చేశారు.



ఏసీబీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

### దిష్టితీసి.. పటాకులు కాల్చి

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏసీబీ కార్యాలయంలో ఉన్న కేటీఆర్ విచారణ అనంతరం తిరిగి తెలంగాణ భవన్‌కు బయల్దేరారు. భవన్ వెనుకవైపు గేటు వద్దకు చేరుకోగానే కార్యకర్తలు జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కేటీఆర్ నినాదాలతో హోరెత్తించారు. పటాకులు కాలుస్తూ హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. మహిళా కార్యకర్తలు గుమ్మడికాయతో దిష్టితీసి, కొబ్బరికాయలు కొట్టి సాదర స్వాగతం పలికారు. కేటీఆర్ సైతం వారికి కృతజ్ఞతలు చెప్తూ జై తెలంగాణ అంటూ నినదిస్తూ భవన్‌లోకి చేరుకున్నారు. కార్యకర్తలను ఉద్దేశించి మీడియా హాల్‌లో హరీశ్, కేటీఆర్ మాట్లాడారు. కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని అంతిమ విజయం మనదేనని ఉద్బోధించారు. సంఘీభావం తెలిపేందుకు తరలివచ్చిన శ్రేణులకు హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు.

### తరలివచ్చిన ముఖ్యనేతలు

కేటీఆర్‌కు సంఘీభావంగా బీఆర్ఎస్ కీలక నేతలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, ఎంపీలు ఉదయమే తెలంగాణభవన్‌కు చేరుకున్నారు. శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, రాజ్యసభలో పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు దీవకొండ దామోదర్‌రావు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జోగురామన్న, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు మంకెన కోటిరెడ్డి, తాతామధు, నవీన్ కుమార్‌రెడ్డి, కుర్మయ్యగారి నవీన్‌కుమార్, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శంభీర్‌పూర్ రాజు, ఎమ్మెల్యేలు వివేకానంద్‌గౌడ్, బండారు లక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎంపీ మాలోతు కవిత, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గాదరి కిశోర్, బాల్కసుమన్, పార్టీ నాయకులు తుల ఉమ, గ్యాదరి బాలమల్లు, ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవి కుమార్‌గౌడ్, తుంగ బాలు, కిశోర్‌గౌడ్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, గాంధీనాయక్, పల్లా ప్రవీణ్‌రెడ్డి తెలంగాణ భవన్‌కు తరలివచ్చారు.

### నీలోఫర్ కేఫ్ వద్ద హైడ్రామా

**ఏసీబీ** కార్యాలయానికి వెళ్తున్న కేటీఆర్ కాన్వయ్‌ను పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో అనుసరించారు. బంజారాహిల్స్‌లోని నీలోఫర్ కేఫ్ వద్ద పోలీసులు అడ్డగించారు. కేఫ్‌లో ఉన్న కార్యకర్తలతోపాటు సామాన్యులను చెదరగొట్టారు. అప్పటికప్పుడు కేఫ్‌ను మూసివేయించారు. మీడియాతో మాట్లాడేందుకు యత్నించిన నాయకులను అడ్డుకున్నారు. లాఠీలతో అడ్డుకొంటూ నెట్టివేసేందుకు యత్నించారు. మహిళా కార్యకర్తలు, మీడియా ప్రతినిధులతోనూ దురుసుగా ప్రవర్తించారు. పలువురిని అదుపులోకి తీసుకొని వాహనాల్లో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



## కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం

- రాజకీయ కక్షలో భాగంగానే కేటీఆర్ విచారణ
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ రెడ్డి ఎన్ని రకాల కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి మరింత పోరాడతామని స్పష్టం చేశారు. రాజకీయ కక్షలో భాగంగానే కేటీఆర్‌ను ఏసీబీ విచారణకు పిలిచినట్టు పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసులో అవినీతి జరిగినట్టు ఏసీబీ వద్ద ఒక్క ఆధారం లేదని తెలిపారు. నాడు మంత్రిగా కేటీఆర్ పారదర్శకంగా, దేశం గర్వించేలా ఈ రేసును నిర్వహించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికొదిలేసి, కేసీఆర్ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రేసు నిర్వహణలో అవినీతి అంటూ కేటీఆర్‌పై కేసు పెట్టించారని, 18 నెలల్లో ఏమీ తేల్చలేకపోయారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ పనిగట్టుకొని మరీ కేటీఆర్‌కు లేని అవినీతిని అంటగట్టి, ఇరుకున పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. మిస్ వరల్డ్ పోటీలతో రాష్ట్రానికి పైసా పెట్టుబడి రాలేదని.. పైగా తనను వేధింపులకు గురిచేశారంటూ మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగీ తీవ్ర ఆరోపణలు చేయడంతో అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర పరువుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ సమీపంలో కేఫ్‌లో ఛాయ్ తాగుతున్న కష్టమర్లను కూడా బలవంతంగా బయటకు పంపించడాన్ని చూస్తే రాష్ట్రంలో పూర్తిగా రాక్షస పాలన నడుస్తున్నదని మండిపడ్డారు.

# రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై అక్రమ కేసులు

- బద్నాం చేసేందుకే కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌పై విచారణ
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, హరిప్రియ తదితరులు

హైదరాబాద్ జూన్ 16 (నమస్తేతెలంగాణ): రాజకీయ కక్షతోనే కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్‌లపై కాంగ్రెస్ సర్కారు కేసులు పెడుతున్నదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. తెలంగాణభవన్‌లో మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డితో కలిసి సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఘోష్ కమిషన్, ఏసీబీ విచారణ పేరిట ప్రజానేతలపై బురదజల్లేందుకు యత్నిస్తున్నదని మండిపడ్డారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, 600 రోజులు దాటినా ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని మండిపడ్డారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసుల పేరిట నాటకాలాడుతున్నదని దుయ్యబట్టారు. అందాల పోటీలకు వచ్చిన మిస్ ఇంగ్లాండ్‌తో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### విచారణ పేరిట వేధింపులు: సునీతాలక్ష్మారెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసమస్యలను పక్కనబెట్టి బీఆర్ఎస్ నేతలను విచారణ పేరిట వేధింపులకు గురిచేస్తున్నదని మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్ములా రేసుతో తెలంగాణ ఖ్యాతిని పెంచిన కేటీఆర్‌పై కక్ష సాధింపులో భాగంగానే ఏసీబీ విచారణకు పిలిచిందని ఆరోపించారు.

### ఇవి డైవర్షన్ డ్రామాలే: ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆరు గ్యారెంటీలను ఎత్తేసే కుట్రలో భాగంగా రేవంత్ ప్రభుత్వం డైవర్షన్ డ్రామాలను మొదలుపెట్టిందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి మండిపడ్డారు. రేవంత్‌కు పరిపాలన చేతకావడం లేదని, మంత్రుల మధ్య సమన్వయ లోపం ఉందని చెప్పారు.

### సీతక్క మాటలు సిగ్గుచేటు: పద్మాదేవేందర్‌రెడ్డి

'కవిత జైలుకు పోయింది..కేటీఆర్ నీకు జైలుకు పోవాలని ఉన్నదా' అంటూ బాధ్యాతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న సీతక్క మాట్లాడటం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి ఫైర్ అయ్యారు. అభివృద్ధిని విస్మరించి కక్ష సాధింపునకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగుతున్నదని మండిపడ్డారు.

### బూటకపు కేసులతో నాటకం: వాసుదేవారెడ్డి

బూటకపు కేసులతో సర్కారు నాటకమాడుతున్నదని దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.






# బీసీ కోటా ఔట్!

> మొదటిపేజీ తరువాయి...

చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రాల కులగణనకు చట్టబద్ధత లేదంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో బీసీ డిక్లరేషన్ అమలు సాధ్యాసాధ్యాలపై లోతుగా చర్చించినట్టు సమాచారం. తుదకు చట్టబద్ధంగా కాకుండా పార్టీపరంగానే రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. దీంతో బీసీలకు కాంగ్రెస్ మరోసారి మొండిచెయ్యి చూపుతున్నది. వెరసి స్థానిక సంస్థల్లో బీసీలకు పార్టీ కోటానే శరణ్యంగా మారనున్నది.

### కేంద్రం ఇవ్వదనీ తెలిసీ కులగణన గారడీ

సుప్రీంకోర్టు మార్గదర్శకాలపై స్పష్టత ఉన్నా, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల వేళ బీసీల ఓట్ల కోసం అలవికాని హామీలిచ్చింది. జనాభా గణన చట్టం-1948 ప్రకారం జనాభా గణన, కులగణన చేపట్టే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉన్నది. ఎలాంటి జనగణన నిర్వహించేందుకూ రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు లేవు. ఇదే విషయాన్ని ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్వయంగా ప్రకటించారు. పలు రాష్ట్రాలు రాజకీయాల కోసం కులగణన చేస్తున్నాయని, కానీ అది చెల్లబోదని కుండబద్దలు కొట్టారు. ఈ వాస్తవాలు, కేంద్రం ఆమోదించదని తెలిసి కూడా కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలను బురిడీ కొట్టించింది. అధికారం చేపట్టిన తరువాత గత సంవత్సరం నవంబర్‌లో దాదాపు రూ.160 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల) నిర్వహించింది. సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్ర జనాభాలో బీసీలు 1,64,09,179 మంది (46.25%), బీసీ ముస్లింలు 35,76,588 (10.08%), ఎస్సీలు 61,84,319 (17.43%), ఎస్టీలు 37,05,929 (10.45%), ఓసీ ముస్లింలు 8,80,424 (2.48%), ఇతర ఓసీలు 44,21,115 (13.31%) మంది ఉన్నట్టు నివేదించింది. స్థూలంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ వర్గాల గణాంకాలనే బయటపెట్టిన ప్రభుత్వం.. కులాలు, ఉపకులాల వారీగా వివరాలను గోప్యంగా ఉంచింది. ఆ గణాంకాల ఆధారంగానే బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. కేంద్రం ఆమోదించదని తెలిసీ గవర్నర్ ఆమోదానికి పంపింది. ఆ తరువాత మళ్లీ బీసీ బిల్లుల ఊసెత్తలేదు. దీంతో బీసీ రిజర్వేషన్ల హామీని తుంగలో తొక్కి ఆ నెపాన్ని కేంద్రంపై మోపడమే కాంగ్రెస్ అసలు ఉద్దేశమనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రూ.160 కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది.

### బీసీలకు ఉన్న 23% రిజర్వేషన్ గోవిందా!

2019 జనవరిలో జరిగిన సర్పంచ్ ఎన్నికల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రిజర్వేషన్లు 50% దాటవద్దని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆ మేరకు 2011 జనాభా లెక్కల ఆధారంగా అప్పటి పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్రంలో రిజర్వేషన్లు ఖరారు చేశారు. బీసీలకు 22.79%, ఎస్సీలకు 20.53%, ఎస్టీలకు 6.68% చొప్పున స్థానాలు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ నిర్వాకంతో ఇప్పుడు ఆ రిజర్వేషన్ కూడా లేకుండా పోయే ముప్పు ఏర్పడింది. స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు ఉన్నాయి. బీసీలకు రాజ్యాంగపరమైన చట్టబద్ధత కలిగిన రిజర్వేషన్లు ఏమీలేవు. ఇప్పటివరకు ఆర్టికల్స్ 243-డీ(6), 243-టీ(6)ను ప్రకారం మాత్రమే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం రిజర్వేషన్లను కలిస్తూ వస్తున్నాయి. గతంలో లాటరీ, ర్యాండమ్ తదితర అశాస్త్రీయ పద్ధతుల్లో బీసీలకు రిజర్వేషన్లను కల్పిస్తూ వస్తుండగా ప్రతిసారీ వాటిపై న్యాయవివాదాలు తలెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు ట్రిపుల్-టీ పేరిట స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. అందులో మొదటిది.. స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేయాలి. రెండవది జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి. మూడవది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లన్నీ కలిపి 50% మించకూడదు. వాటినే ట్రిపుల్-టీ అంటారు. ఆ మార్గదర్శకాలను పాటించని ఏ రాష్ట్రంలో కూడా స్థానికసంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలుచేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. ఆ నిబంధనలను పాటించని గుజరాత్, మహారాష్ట్ర తోపాటు పలు రాష్ట్రాల్లో స్థానికసంస్థల ఎన్నికలను కూడా దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే మార్చాలని స్పష్టంచేసింది. సూటిగా చెప్పాలంటే డెడికేటెడ్ కమిషన్ నివేదిక లేకుండా స్థానికసంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్లు ఇకపై ఉండబోవనేది స్పష్టంగా తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కూడా బూసాని వెంకటేశ్వర్లు నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిషన్ సైతం నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. కులగణన గణాంకాలకు సాధికారత లేకపోవడంతో కమిషన్ కల్పించిన 42% రిజర్వేషన్ చెల్లకుండా పోతున్నది. ప్రస్తుతం గతంలో ఉన్న 23% రిజర్వేషన్‌ను కల్పించాలన్నా డెడికేటెడ్ కమిషన్ మళ్లీ నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. అందుకు సుదీర్ఘ సమయం పట్టే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం బీసీలకు సైతం స్థానిక సంస్థ ఎన్నికల్లో ప్రస్తుతం అమలవుతున్న 23% రిజర్వేషన్ కూడా ఉండబోదనేది తేలిపోయింది. ఈ నేపథ్యంలోనే కేంద్రంపై నెపం మోపి పార్టీ పరమైన రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్టు అర్థమవుతున్నది.

### ముందే చెప్పిన 'నమస్తే తెలంగాణ'..

**సుప్రీంకోర్టు** మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ప్రధానంగా ఓటర్ జాబితా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. మహారాష్ట్ర సైతం అదేబాటలో కొనసాగుతున్నది. బీహార్, కర్ణాటక రాష్ట్రాలు సమగ్ర కుల సర్వేలను నిర్వహించాయి. వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కసరత్తు చేసినా అవి ఇప్పటికీ కొలిక్కిరాలేదు. ఒడిశా ప్రభుత్వం మాత్రం కమిషన్‌ను ఏర్పాటుచేయకుండా, బీసీ రిజర్వేషన్లను మొత్తంగా రద్దు చేసి, వాటన్నింటినీ జనరల్ స్థానాలుగా మార్చింది. అయితే, అక్కడి ఒడిశా ప్రభుత్వం బీసీలకు పార్టీ పరంగా 50% టికెట్లు కేటాయించింది. కాంగ్రెస్ సర్కారు సైతం అదే ఎత్తుగడను అమలుచేసేందుకు సిద్ధమవుతున్నదని 'నమస్తే తెలంగాణ' ముందునుంచీ చెప్తూ వస్తున్నది. ప్రామాణికమైన డాటా లేకుండా, డెడికేటెడ్ కమిషన్ సిఫారసులు చెల్లబోమని, ఈ నేపథ్యంలో ఒడిశా తరహాలోనే పార్టీ పరంగా టికెట్లు కేటాయించి, తద్వారా 42% రిజర్వేషన్ హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ చూస్తున్నదని ఆదినుంచీ చెప్తున్నది. అందుకు తగ్గట్టుగానే ప్రస్తుతం మంత్రుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం వస్తుండటం గమనార్హం.


